## క్లుప్తంగా

### రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసిన మహిళకు పండ్లు అందజేస్తున్న పోలీసులు

ఓడీచెరువు: రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఎస్పీ వాసుదేవన్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానంతో మరొకరి ప్రాణాలను కాపాడొచ్చన్నారు. ఆరోగ్యంగా ఉన్న వారు రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం చేయడం వల్ల అనారోగ్యానికి గురయ్యే అవకాశం లేదన్నారు. అప్పుడప్పుడు రక్తదానం చేయడం ఆరోగ్యకరమని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. దాదాపు 30 మంది రక్తదానం చేసినట్లు సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు.

### మహిళ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని నాగులబావి వీధికి చెందిన లక్ష్మీదేవి కుటుంబ కలహాలతో ఆదివారం వాజ్‌మోల్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను వైద్య చికిత్సల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేయడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### మండల కేంద్రానికి చేరిన మొక్కలు



ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొక్కలను భద్రపరుస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: ఇళ్ల వద్ద పెంచుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా మొక్కలను అందజేస్తుందని అధికారులు తెలిపారు. ప్రజలకు అందజేసేందుకు 12 రకాల మొక్కలను ఇప్పటికే మండల కేంద్రాలకు చేరవేసింది. పుట్టపర్తి మండలంలోని 14 పంచాయతీలకు 4,815 మొక్కలను సరఫరా చేసింది. ఇందులో మహాఘని, సపోటా, నాగలింగం, నిమ్మ, రోజ్‌ఉడ్, కదంబ, బాదాం, టేకు, మారేడు, కరక, నేరేడు, రామ సీతాఫలం వంటి మొక్కలు ఉన్నాయి. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మొక్కలను భద్రపరిచారు. త్వరలోనే మొక్కలను ఆయా పంచాయతీలకు పంపిణీ చేస్తామని ఈఓఆర్డీ అశోక్‌కుమార్ రెడ్డి తెలిపారు.

### వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



మృతుడి భార్య సాయిలీలకు తక్షణసాయం చెక్కు అందజేస్తున్న దృశ్యం

పుట్టపర్తి టౌన్: బుక్కపట్నం మండలం జానికాంపల్లి గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తూ మరణించిన వెంకటేష్ కుటుంబానికి వైఎస్సార్‌బీమా తక్షణసాయం కింద రూ.10 వేల చెక్కును ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ బీమా పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ గోవర్దన్ రెడ్డి, సహహార సంఘం మాజీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బట్టల కేశవ, కృష్ణారెడ్డి, అమర్నాథ్ రెడ్డి, దామోదర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనాల ఢీ: ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న ఓబిలేసు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ఎర్రగుంట మేడాపురం క్రాస్ వద్ద ఆదివారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మల్లాకాలువ గ్రామానికి చెందిన ఓబిలేసు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మరో ద్విచక్ర వాహనం మేడాపురం క్రాస్ వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో ఓబిలేసు కాలికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే అతడ్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# చకచకా ఇళ్ల నిర్మాణం

- నియోజకవర్గంలో 18,940 ఇళ్ల మంజూరు
- ఇప్పటికే 4,286 ఇళ్ల నిర్మాణాలు పూర్తి
- నెరవేరుతున్న సొంతింటి కల
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పుట్టపర్తి మండలం జగరాజుపల్లి జగనన్న కాలనీలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలు

పుట్టపర్తి అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అర్హులందరికీ ఇంటి స్థలం, పక్కా ఇళ్ల మంజూరు చేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పుట్టపర్తి నియోజకవర్గానికి 18,940 ఇళ్లు మంజూరయ్యారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన జగనన్న కాలనీల్లో జోరుగా ఇళ్లు కట్టించుకుంటున్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి లక్షలాది రూపాయల విలువ చేసే ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూరుస్తూ ప్రభుత్వం పేదలకు పూర్తి సహకారం అందిస్తోంది. కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రోడ్డు, బోరు, ఇంకుడు గుంతలు ఇలా అన్ని సౌకర్యాలను కల్పిస్తోంది. ఇంటి పట్టాలు తీసుకున్న వారితో గృహ నిర్మాణాలు పూర్తి చేయించడానికి అధికారులు తరచూ సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇళ్లు కట్టించుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వెన్నంటి సహకారం అందిస్తున్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని అమడగూరు, ఓడీచెరువు, నల్లమాడ, బుక్కపట్నం, కొత్తచెరువు, పుట్టపర్తి రూరల్, పుట్టపర్తి అర్బన్ మండలాలను అహుడా పరిధిలోకి తీసుకురావడంతో వేలాది ఇళ్లు మంజూరయ్యాయి. ఆయా మండలాల్లో 101 జగనన్న కాలనీలు ఏర్పాటవుతున్నాయి. పుట్టపర్తి పట్టణ సమీపంలో సుమారు 40 ఎకరాల్లో 2 వేల ఇళ్లతో ఒక నూతన గ్రామమే ఏర్పడుతోంది. సొంతింటి కల నెరవేరనుండటంతో పేదలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

#### వివిధ దశల్లో ఇళ్ల నిర్మాణాలు

పుట్టపర్తి నియోజక వర్గంలోని ఆరు మండలాలకు సుమారు 18,940 ఇళ్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటి వరకూ 4,286 ఇళ్ల నిర్మాణం పూర్తయ్యాయి. వాటిలో ఇప్పటికే గృహప్రవేశాలు పూర్తయ్యాయి. ఇక బీబీఎల్‌లో 5,629, బీఎల్ కింద 4,237, ఆర్ఎల్ కింద 1,882, ఆర్‌సీ కింద 844 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. గత ఏడాది డిసెంబర్ నాటికి కేవలం 475 ఇళ్లు పూర్తి కాగా నేడు వేగం పుంజుకొని 4,286 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.

#### విలువైన స్థలాల్లో జగనన్న కాలనీలు

పుట్టపర్తి మండలం పెడపల్లి 1, 2 కాలనీలు, బుక్కపట్నం, జానికాంపల్లిలో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన ఒకటిన్నర సెంటు ఇంటి స్థలాల పక్కనే నేషనల్ హైవే–342 వెళ్తోంది. అక్కడ ఒక్కో ప్లాటు కనీసం రూ.10 లక్షలు పలుకుతోంది. జగరాజుపల్లి, బీడుపల్లి, కొత్తచెరువు ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి కాలనీ సైతం ప్రధాన రహదారి పక్కనే స్థలాలు ఇచ్చారు. ఇళ్ల స్థలాల విలువ రూ.లక్షల్లో పలుకుతున్నాయి.

| మండలం | మంజూరైన ఇళ్లు | పూర్తయిన ఇళ్లు |
|---|---|---|
| అమడగూరు | 1,607 | 133 |
| బుక్కపట్నం | 2,337 | 655 |
| కొత్తచెరువు | 2,379 | 1,160 |
| నల్లమాడ | 4,420 | 774 |
| ఓడీచెరువు | 3,697 | 128 |
| పుట్టపర్తి రూరల్ | 1,576 | 503 |
| పుట్టపర్తి అర్బన్ | 2,924 | 933 |
| మొత్తం | 18,940 | 4,286 |



పూర్తయిన ఇంటి నిర్మాణం

#### చాలా సంతోషం



ఇల్లు లేని మాకు ఎటువంటి సహకారం లేకుండానే మొదటి విడతలోనే ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశం చేశాము. రోడ్డు పక్కనే ఒకటిన్నర సెంటు స్థలం ఇచ్చారు. అధికారుల సూచనలతో ఇంటిని బాగా నిర్మించుకున్నాం. సీఎం వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటాం.

– లక్ష్మీనరసమ్మ, జగరాజుపల్లి

#### గృహ ప్రవేశం చేశాం..



మేము జీవితంలో సొంత ఇల్లు కట్టుకుంటాం అనుకోలేదు. ఓ పెద్ద కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేసి ఇల్లు నిర్మించారు. ఎంతో కాలంగా అద్దె ఇంటిలో ఉండి తీవ్ర ఇబ్బందులు పడ్డాం. సంపాదించినదంతా ఇంటి అద్దెకే సరిపోయేది. ఇటీవలే గృహ ప్రవేశం చేసి సంతోషంగా ఉన్నాము. ఇప్పుడు నాకు సొంత ఆస్తి ఉందని గర్వంగా చెబుతున్నాను.

– షేక్ రిజ్వానా, పుట్టపర్తి

#### అర్హులందరికీ ఇళ్ల మంజూరు



పుట్టపర్తి నియోజక వర్గంలోని పేద ప్రజలంతా సంతోషంగా ఉండాలి. ఇంకా ఎవరైనా అర్హులు ఉంటే సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే ఇళ్లు మంజూరు చేస్తాం. వంద శాతం హామీలను అమలు చేసిన మన ముఖ్యమంత్రి జగన్‌కు ప్రజలు అండగా నిలవాలి. అందరం కలసి పుట్టపర్తి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే, పుట్టపర్తి నియోజకవర్గం

### సర్వేలు పూర్తి చేయండి

నల్లచెరువు: మండల పరిధిలోని వలంటీర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ, ఆయుష్మాన్ భారత్ కార్డులకు సంబంధించిన సర్వేలను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ శకుంతల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

### ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఆక్యుప్రెజర్ వైద్యం చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రామ్‌నగర్‌లో ఉన్న కోదండ రామాలయంలో ఆదివారం నిర్వహించిన సిద్ధ ఆయుర్వేద యోగా ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించిందని నిర్వాహకులు తిరుమలేసు, నరేష్‌బాబు, దాసరి రామన్న, రవీంద్రదాస్ తెలిపారు. ఈ శిబిరంలో వెన్నెముక నొప్పి, మోకాళ్ల నొప్పులు, మెడ నొప్పులు, భుజాల నొప్పులు, కీళ్ల నొప్పులు, పక్షవాతం, లివర్, గాల్‌బ్లాడర్, కిడ్నీ సమస్యలు, కడుపునొప్పి, వినికిడి లోపం తదితర సమస్యలకు ఆక్యుప్రెజర్ వైద్య నిపుణులు జైశ్రీరామ్, శిష్యులు రాఘవేంద్ర తదితరులు వైద్య పరీక్షలు చేశారు.

### శివాలయానికి విరాళం

ధర్మవరం: పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో ఉన్న శివాలయానికి ఆదివారం 27వ వార్డు కౌన్సిలర్ డోలా ఓబుళమ్మ, వార్డు ఇన్‌చార్జ్ డోలా రాజారెడ్డి రూ.10 వేల విరాళాన్ని అందించారు. ఆలయ అభివృద్ధికి నగదు వెచ్చించాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. సర్వేలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు.

## పాడిపరిశ్రమ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి అభినందనీయం



ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని కలిసిన రాడ్స్ సంస్థ ప్రతినిధులు

కనగానపల్లి: రాప్తాడు నియోజకవర్గంలో అమ్మ డెయిరీ ఏర్పాటు చేసి పాడిపరిశ్రమ అభివృద్ధికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని రాడ్స్ సంస్థ అధ్యక్షుడు బండ్లపల్లి మదన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా పాడి పరిశ్రమ అభివృద్ధి తీసుకోవాల్సిన చర్యలపై రాడ్స్ సంస్థ ప్రతినిధులు ఎమ్మెల్యేతో చర్చించారు. పాడి రైతుల సంక్షేమం కోసం రాడ్స్ సంస్థ చేస్తున్న వివిధ కార్యక్రమాలపై వారు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో పాటు నియోజకవర్గంలో అమ్మ డెయిరీ ఏర్పాటు ద్వారా మహిళా రైతులు పొందుతున్న ఉపాధిపై ఎమ్మెల్యేకు వారు అభినందనలు తెలియజేశారు. సమావేశంలో రాడ్స్ సంస్థ సలహాదారు తలమర్ల సంజీవరెడ్డి, సభ్యులు భక్త భూషణ్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## జానపద కళాకారులను ప్రోత్సహిస్తాం



కళాకారులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

నల్లమాడ: తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ట్రస్టు వ్యవస్థాపకుడు ఎస్.అంజనప్ప, కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికం సాయి మాట్లాడుతూ.. మండలంలోని చారుపల్లిలో శనివారం రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన సందర్భంగా సంగీత దర్శకులు (హార్మోనిస్టు) వి.చంద్రశేఖర్, వై.ధనుంజయ, మీసాలవాండ్లపల్లికి చెందిన కోలాటం గురువు పరమేశ్‌కు ప్రశంసాపత్రాలు అందజేసినట్లు తెలిపారు. కనుమరుగవుతున్న జానపద, పౌరాణిక కళారూపాలకు పూర్వ వైభవం తీసుకొస్తామని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలో సైతం తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్టు కళాకారులను ప్రోత్సహిస్తోందన్నారు. జానపద, పౌరాణిక కళారూపాలను భావితరాలకు తెలియజేయడం వల్ల మన సంస్కృతీ, సంప్రదాయాలు కాపాడుకోవచ్చన్నారు.

### నేడు 'స్పందన'

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండలస్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయాలని సూచించారు.

తాడిమర్రి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయాల సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆదేశించారు. అర్జీదారులు తమ సమస్యలు తెలుపుతూ ఇస్తున్న అర్జీలకు ఆధార్‌కార్డు నకళ్లు జత చేయాలని తెలిపారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

కొత్తచెరువు: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని దర్గా, విజయనగర కాలనీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత మండల కేంద్రానికి చేరుకున్న ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని తెలియజేస్తూ కరపత్రాలను అందజేశారు. దర్గా, విజయనగర కాలనీ, ధర్మవరం రహదారిలో ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలు, ఆడపడుచులను ఆప్యాయంగా పలకరించారు. ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒక సంక్షేమ పథకాన్ని అందించి వారికి అండగా ముఖ్యమంత్రి జగన్ నిలిచారన్నారు. గతంలో అభివృద్ధి అంటే ఏమో తెలియని పరిస్థితుల్లో రాష్ట్రం ఉక్కిరిబిక్కిరి అయ్యిందన్నారు. నేడు జగనన్న పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని వెల్లడించారు. కొత్తచెరువు మండలం వైఎస్సార్‌సీపీకి పుట్టినిల్లు అన్నారు. మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ జగనన్న కాలనీల్లో స్థలాలు, ఇళ్ల నిర్మాణాలకు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. అంతేకాక గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. ఇంతకంటే ఏ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని ప్రశ్నించారు. మళ్లీ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే జగనన్నతోనే సాధ్యమని తెలిపారు. మరొక్కసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నారేపల్లి జగన్మోహన్ రెడ్డి, జెడ్పీటీసీ గంగాదేవి, నాయకులు రెడ్డప్పరెడ్డి, నాగరాజు, మటన్ శంకర్, పుట్టపర్తి ఎంపీపీ రమణారెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అంగడి సోమశేఖర్ రెడ్డి, మాధవ రెడ్డి, టౌన్ కన్వీనర్ వడ్డె భాస్కర్, దర్గా కమిటీ మేనేజర్ అతావుర్ రహిమాన్, జిల్లా వక్ఫ్‌బోర్డు ఉపాధ్యక్షుడు షాన్‌షేట్, దాల్‌మిల్ సూరి, అజీజ్, ఎంపీటీసీ రఫి, పెయింటర్ కేశవ, యల్లప్ప, వాల్మీకి శంకర, ఆవుల అశోక్, డీలర్ శీన, బళ్లారి బాబు, మనోహర్, సుబ్బారావు, మనోహర, మారుతి, ప్రభావతమ్మ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

### చౌడేశ్వరీ దేవికి పూజలు



తాడిమర్రి: మండలంలో పెద్దకోట్ల గ్రామంలోని చౌడేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ పూజారి అమ్మవారి మూలవిరాట్‌కు వెండి ఆభరణాలు తొడిగి, పూలమాలలతో అందంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

## ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బత్తలపల్లి: జనాభా దామాషా ప్రకారం న్యాయమైన ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఈఎఫ్ నాయకులు నాగరాజు, ఎమ్మార్పీఎస్ సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు బుదెప్ప కోరారు. ఆదివారం మండలంలోని బత్తలపల్లి, పోట్లమర్రి, సంజీవపురం ఎస్సీ కాలనీల్లో 'విశ్వరూప మహాసభ ఛలో హైదరాబాద్' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యక్రమానికి గ్రామాల నుంచి విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. బీజేపీ ప్రభుత్వం ఎమ్మార్పీఎస్‌కు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బత్తలపల్లి పాముల పెద్దన్న, గంటాపురం కాటమయ్య, పూజారి పెద్దన్న, జయరాం, రామాంజి, నారాయణ, మోహన్, పోట్లమర్రి రాజశేఖర్, రమేష్, నిరంజన్ ఇతర మహిళా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి అమానుషం



పుట్టపర్తి ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు



కదిరి ఆర్టీసీ డిపో వద్ద మాట్లాడుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు



ధర్మవరం ఆర్టీసీ డిపోలో నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

ధర్మవరం అర్బన్: కావలి డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ధర్మవరం ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపోలో ఆదివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు నాగార్జునరెడ్డి, నరసింహులు, ఆదినారాయణ, ముస్తఫా మాట్లాడారు. ఆర్టీసీలో డ్రైవర్ల పాత్ర కీలకంగా ఉంటుందన్నారు. సకాలంలో గమ్యస్థానానికి ప్రయాణికులను చేరుస్తున్నారని తెలిపారు. బస్సుకు ముందు అడ్డంగా ఉన్న టూవీలర్ తీయాలని హారన్ కొట్టినందుకు డ్రైవర్‌పై విచక్షణారహితంగా దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పుట్టపర్తి టౌన్: నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేయడం దుర్మార్గమని ఆర్టీసీ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈయూ ఏ, వైఎస్సార్ ఈఏ పుట్టపర్తి ఆర్టీసీ డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎస్ఎంయూఏ నాయకులు మద్దతు తెలిపారు. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చే ఆర్టీసీ ఉద్యోగులపై దాడి చేయడం సరికాదన్నారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శేఖర్, ఖలీముల్లా, రహణప్ప, శ్రీనివాసులు, ముత్యాలప్ప, మోహన్‌నాయక్, చంద్రశేఖర్, కేశప్ప, ఈశ్వరయ్య, షబ్బీర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: కావలిలో ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఆర్టీసీ ఉద్యోగులు కోరారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదుట ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు గేట్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిత్యం లక్షలాది మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చే డ్రైవర్, కండక్టర్లపై దాడి చేయడం అన్యాయమన్నారు. ఉద్యోగులపై భౌతికదాడులకు పాల్పడటం తగదన్నారు. ఘటన జరిగిన వెంటనే ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావ్ రాంసింగ్‌ను పరామర్శించి మనోధైర్యం చెప్పడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ఈయూ రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్, జిల్లా కార్యదర్శి జీవైపీరావ్, డిపో నాయకులు ఆర్ఎస్‌రెడ్డి, శంకర్, రవినాయక్, జీసీఎస్‌నాయుడు, విశ్వనాథ్‌రెడ్డి, అనిల్‌సింహా, హరికుమార్ పాల్గొన్నారు.

### పెద్దమ్మ దేవతకు పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని పాతూరులో వెలసిన పెద్దమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని వెండి ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వర్షాలు కురవాలని రైతులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.